


ఆరేళ్ళ తరవాత నా హృదయం ఆనందంతో పరవశమయింది. నేను సాధించిన విజయం ఇతరుల దృష్టిలో అతి సామాన్యమయినదే కావచ్చును. నాకు మాత్రం అత్యంత ఘనంగా తోచింది. ఆరేళ్ళపాటు చదువు సంధ్యలకు దూరమై సంపాదన, కుటుంబ పోషణ, అనారోగ్యం, తదితర తాపత్రయాలతో సతమత మవుతున్న నేను మళ్ళీ చదువు ప్రారంభించి పాసవుతానని కలలోకూడా ఊహించలేకపోయాను. అందులోనూ ఫస్టు క్లాసులో పాసయేసరికి నా ఆనందానికి అవధులు లేకపోయాయి.

ఆఫీసులో అందరికీ పార్టీ ఇచ్చి, గాలిలో తేలిపోతున్న మనస్సుతో భావి సౌధాన్ని నిర్మించుకుంటూ ఇంటికి బయలుదేరాను. ఆఫీసులో పని ఆ నాడు అలసటే కలిగించలేదు. ఆఫీసులో పనే కాదు, గత ఆరు సంవత్సరాలపాటూ మోసిన కుటుంబభారం కూడా ఆ నాడు అంత భారం అనిపించలేదు. ప్రస్తుతం కన్న ఉన్నత దశ లభిస్తుందనే ఆశా భావమే నా కా హాయిని కలిగించింది. నేను ఇన్నాళ్ళనుంచీ సంపాదిస్తున్న మూడు వందల రూపాయల జీతం ఈ మహా పట్నంలో ఏ మూలకి? వంద రూపాయలు ఇంటి అద్దె, తక్కినది తిండికి చచ్చి చెడి సరిపోతూంది. ఇక అమ్మకి చీటికీ మాటికీ మందులూ, అక్కయ్యకీ, అమ్మకీ నాకూ చీరలూ అవీ—వీటన్నిటికీ సరిపోవనే కదా వీళ్ళ దగ్గరా, వాళ్ళ దగ్గరా టైపింగ్ పని సంపాదించి సాయంకాలం పూట కూడా పనిచేస్తున్నాను. ఇంట్లో కూర్చుని సంగీతం పాఠాలు చెప్పి అక్కయ్య సంపాదించేదిమాత్రం ఏ మూలకి? ఎంత సంపాదించినా రోజు రోజుకీ అవసరాలు పెరిగిపోతూనేఉన్నాయి.

గడిచిన ఆరు సంవత్సరాలలోనూ ఏనాడైనా ఒక్క సినిమాకి వెళ్ళి ఎరుగుదునా? ముఖానికి పౌడరు రాసుకుని ఎరుగుదునా? చిన్నతనం నుంచీ నాకు గాజులూ, పువ్వులూ అంటే ఎంత ఇష్టం. అటువంటిది ఈ మధ్య ఏనాడైనా ముచ్చటకయినా పువ్వులు పెట్టుకుని ఎరుగుదునా? పైస పైసా లెక్కపెట్టి అవసరాలకి సరిపెట్టుకోవటమే సరిపోతున్నది.

ఈ పరిత్యాగమంతా ఎవరికోసం? నాన్నగారి కిచ్చిన మాట నిలబెట్టుకోవటం కోసం కదా? అమ్మ, అక్కయ్య అనాథలై పోకుండా చూడటంకోసం కదా? ఆఫీసులో తోటి ఆడవాళ్ళందరూ నాతో ఎన్నిసార్లు అనే వారు — పెళ్ళిచేసుకో, పెళ్ళిచేసుకో — అని? పాతికేళ్ళు పైబడ్డాయి. వయస్సు ముదిరాక పెళ్ళి చేసుకుని ప్రయోజనం ఏమిటని ఎన్నిసార్లు అనలేదు? నేనూ వాళ్ళతో అనేక

పర్యాయాలు వివరంగా చెప్పాను నా సంసార సమస్యలు. నేను పెళ్ళి చేసుకుని నా సుఖం నేను చూసుకుంటే అమ్మనీ, అక్కయ్యనీ ఎవరు చూస్తారు? నన్ను పెళ్ళిచేసుకునే వాడు వాళ్ళని కూడా ఆదరించేటంత ఉదార పురుషుడు కావద్దా? అటువంటి వాడు లభ్యం కావటం మాత్రం సామాన్యమా? — అని కొన్ని సార్లు వాదించాను. మరి కొన్ని సార్లు — నాకు పెళ్ళి పైన ధ్యాసలేదు. పెళ్ళిచేసుకోకపోతే మనిషి జీవించలేదా— అంటూ వాదించాను. ఈ వాదన ఆత్మ వంచన అని నా అంతరాత్మకి తెలుసు. పెళ్ళి! పెళ్ళి! పెళ్ళి! ఎందుకు వీళ్ళంతా నన్నిలా రెచ్చ గొడుతారు? నాకు సంబంధం చూసేవా డెవడున్నాడు? నన్ను చేసుకుంటానని ముందుకొచ్చినవా డెవడున్నాడు? — అని తలగడాలో తల దూర్చి కన్నీరు కార్చిన రాత్రులు లేక పోలేదు.

నా స్వంత సుఖం కన్నా నా కర్తవ్య సాధన ముఖ్యమని ఆరేళ్ళ క్రితమే నేను నిర్ణయించుకున్నాను. ఇటువంటి యాంత్రికమయిన, రస విహీనమయిన జీవితం అనంతంగా సాగిపోయినా సరే నేను బాధపడదలుచుకోలేదు.

ఎన్నో స్వల్ప విషయాల మీద అమ్మ మీదా, అక్కయ్య మీదా విసుగూ, కోపమూ కలిగిన మాట వాస్తవం. నే నింత కష్టపడి చెమట ఓడ్చి సంపాదించుకొచ్చి వాళ్ళ సుఖంకోసం తాపత్రయ పడుతున్నాననే తెలివి కూడా లేకుండా అర్థవిహీనంగా మాట్లాడుతూఉంటారు. నన్నొక యంత్రంలా చూడటంమాత్రం సహించలేకపోతూ ఉంటాను. సాయంకాలం ఒక్క అరగంట ఆలస్యంగా వస్తే చాలు ఆరాలు తీస్తారు. రణ రంగంలో దెబ్బలు తిన్న సైనికునిలా సాయంకాలం ఆఫీసు నుంచి అలిసిపోయి, వాడిపోయి వచ్చానని కూడా ఆలోచించకుండా— "ఆ మందులు తెచ్చావుటే?" అని అక్కయ్యా నా ప్రాణాలు తీస్తారు. ఆ సమయంలో నేను చచ్చిపోయినా వీళ్ళొక కన్నీటిబొట్టు రాల్చరేమో అనిపిస్తుంది.

అమ్మ ఎప్పుడూ అక్కయ్యనే వెనకేసు కొస్తుంది, ప్రతి స్వల్పవిషయం లోనూ. అక్కయ్య అనర్థానికీ, అమ్మ అనారోగ్యానికీ నేనే మూల కారణ మయినట్లు మాట్లాడుతుంది అమ్మ. నా పుట్టుకతోనే తనకి అనారోగ్యం ఆరంభ మయిందిట.

రోజూ పొద్దున్నే బజారుకు వెళ్ళి కూరలు తీసుకొస్తాను. అది చాలక— "అక్కయ్య పొయ్యి దగ్గర పడి అలా సతమత మౌతూంటే కాస్త సాయం చెయ్యకూడదుటే — అలా మగరాయుడులా పేపరు చదువుతూ కూర్చోకపోతేనూ" అంటూ సాధిస్తుంది అమ్మ. అందుకే నాకు ఒక్కొక్కప్పుడు ఇంట్లో కన్న ఆఫీసులోనే ప్రాణం హాయిగా ఉంటుందనిపిస్తుంది. నేను చేసిన పనిని అప్పుడప్పుడు మెచ్చుకునే ప్రాణులయినా ఉన్నా రక్కడ. అక్కయ్య సరేసరి. తెచ్చిన జీతమంతా దాని చేతిలోనే పోస్తాను. పెత్తనమంతా దానిదే. నా సొంతఖర్చుకోసం మాత్రం నా పై సంపాదన వాడుకుంటాను. అదికూడా బస్సు ఛార్జీలు, తదితర ఖర్చుల కోసం. ఎప్పుడైనా నెలాఖరున రెండు రూపాయ లడిగితే నేను బాధ్యతా రహితంగా ప్రవర్తిస్తున్నట్లూ, సంసార బాధ్యతలు పట్టించుకోనట్లూ మాట్లాడుతుంది. అమ్మ దానికి తందానతాన అంటుంది.

నేను బాధ్యత పట్టించుకోకుండానే ఇన్నాళ్ళూ గడిచాయా? అమ్మ, అక్కయ్యల బాధ్యత నాన్నగారు నా చేతుల్లో పెట్టినప్పుడు నా వయస్సు ఇరవై సంవత్సరాలు. చదువు సంధ్యలూ, ఆట పాటలూ తప్ప మరో బాదరబందీ ఎరుగని రోజులు. భావి జీవితాన్ని గురించి తీయని కలలు కంటున్న రోజులు. కష్టమనేదాన్ని చవిచూడని రోజు లవి. ఆ సంవత్సరంతో డిగ్రీ సంపాదిస్తానని ఉత్సాహంతో ఉయ్యాల లూగుతున్న రోజు లవి. ఫస్టు క్లాసులో పాసవాలని పట్టుపట్టి చదువుతున్న రోజులు.

ఆ మర్నాటి నుంచీ పరీక్షలు ప్రారంభమవుతాయనగా క్రితం రోజు అకస్మాత్తుగా నాన్నగారికి పక్షవాతం వచ్చింది. ఇంట్లో ఉన్నది అమ్మా, అక్కయ్యాను. అమ్మ అసలే రక్తపుపోటుతో బాధపడుతున్న మనిషి, హఠాత్తుగా తగిలిన ఆ దెబ్బకి తట్టుకోలేక అక్కడే కూలబడిపోయింది. అక్కయ్య వికలాంగి. లేచి చకచకా తిరగలేని మనిషి. ఇంట్లో మరో మగ దిక్కు అంటూ లేదు. పరీక్ష చదువుల మాట మరిచి వెంటనే డాక్టరు

# అబ్బూరి ఛాయాదేవి

దగ్గరికి పరుగెత్తాను. ఆయన డాక్టరే కాదు — మా యోగ క్షేమాలను కాంక్షించే సహృదయుడూ, స్నేహితుడూను. నన్నూ, నా పరిస్థితినీ చూడగానే ఉన్నవా డున్నట్లుగా ఎక్కడి రోగుల్ని అక్కడే వదిలి నాతో వచ్చేశారు మా ఇంటికి.

మేము పెద్దగా ఉన్నవాళ్ళం కాదు. అలాగని తిండికీ, గుడ్డకీ లోటులేదు.



పరీక్ష చదువు

చిత్రం— వి. యశ్వంతి పట్నాయక్ (మద్రాసు—3)

నాన్నగారు ఎంత సంపాదిస్తున్నారో, ఇల్లు ఎలా చక్కబెట్టు కొస్తున్నారో ఇంట్లో ఎవ్వరికీ తెలియదు. అమ్మతో డబ్బు వ్యవహారాలు చర్చించే అలవాటు ఆయన కెప్పుడూ లేదు. అలాగని అమ్మకి గాని, మాకుగాని ఎప్పుడూ ఎలాంటి లోటూ రానివ్వలేదు. సంవత్సరానికి సరిపడ్డ బట్టలూ, ఏ కాలంలో వచ్చే కూరలూ పళ్ళూ ఆ కాలంలో సమృద్ధిగా తెస్తూ ఉండేవారు. అక్కయ్యా, నేనూ ఏదైనా కావాలని అడిగితే లేదనకుండా ఉన్నంతలో మమ్మల్ని సంతృప్తి పరిచేవారు. అక్కయ్య చిన్నప్పటి నుంచీ చదువులో కొంచెం మందంగానే ఉండేది. ఇద్దరం ఒకే క్లాసు చదువుతూ ఉండేవాళ్ళం, ఆరో క్లాసుదాకా. ఆ సంవత్సరమే అక్కయ్య జీవితం చీకటి బాటలో పడింది. సాయంకాలం పుస్తకాల సంచీలు భుజాన వేసుకుని గెంతుకుంటూ వస్తూండగా వచ్చే పోయే రెండు బళ్ళ మధ్య అక్కయ్య పడిపోయింది. బండి చక్రం అక్కయ్య కాలు మీదుగా పోయింది. స్పృహతప్పి పోయిన అక్కయ్యని ఆ బండిలోనే ఇంటికి తీసుకు వెళ్ళాను. అప్పటినుంచీ కాలు విరిగిపోయిన అక్కయ్య చదువు మానేసి ఇంట్లోనే ఉండిపోయింది. నాన్నగారు దానికి ఇంట్లో ప్రైవేటుగా చదువు చెప్పించటానికి ప్రయత్నించారు. అక్కయ్య చదువుమీద శ్రద్ధ చూపించకుండా సంగీతం నేర్చుకుంటానని పట్టుపట్టింది. నాన్నగారు దాని మాట కాదనకుండా సంగీతం చెప్పించారు. కొన్నాళ్ళు కాలుమీద బెంగతో ఏడుస్తూ ఉండేది. తరవాత తరవాత క్రమంగా అలవాటుపడిపోయి అమ్మ వెనక కూడా కూడా తిరుగుతూ అమ్మకి చేదోడువాదోడుగా ఉంటూ వచ్చింది. నేను బి. ఎ. దాకా వచ్చాను.

ఆ మర్నాటి నుంచీ పరీక్షలు. కానీ, ఆ ప్రసక్తే ఎత్తటానికి వీలులేని పరిస్థితు లేర్పడిపోయాయి — నాన్నగారి ఆకస్మిక పక్షవాతంతోనూ, అమ్మ రక్తపు పోటు ఉధృతంతోనూ. వారం రోజులు పోయాక మా డాక్టరు గారే నన్ను పక్కకి పిలిచి నా భుజాన్ని ఆప్యాయంగా తడుతూ, "ఊరికే బెంగపెట్టుకోకమ్మా, సెప్టెంబరులో పరీక్షకి వెడుదుగానిలే. అయినా ఎందుకైనా మంచిది — టైపింగులో ట్రెయినింగు తీసుకో" మని సలహా ఇచ్చారు.

నాకు టైపిస్టుగా ఉద్యోగం దొరికిందని తెలిసిన తరవాత వారం తిరగకుండా నాన్నగారు శాశ్వతంగా మమ్మల్ని విడిచి వెళ్ళారు—ఇహ మా కో దారి దొరికింది, తను లేకపోయినా ఫరవాలే దనుకున్నట్లుగా. వడి ప్రవాహంలో కొట్టుకుపోయే వాడికి నావ సహాయం దొరికినట్లుగా ఆ నాడు నాకు ఉద్యోగం దొరకటం వల్ల పెద్ద గండం గడిచినట్లయి తేలికగా ఊపిరి పీల్చుకోవటానికి వీలయింది గాని, ఆనందం అనేది అందులో లేదు.

ఆరేళ్ళ అనంతరం ఆనందం కలిగింది నాకు. సాధారణంగా ఆఫీసు విషయాలు

గాని, నా మనస్సులోని తర్జన భర్జనలు గాని, సంతోష విచారాలుగాని అక్కయ్యతోనూ, అమ్మతోనూ నేనెప్పుడూ చర్చించను. వాళ్ళు నన్ను సహృదయంతో అర్థం చేసుకోలేరని నాకు తెలుసు. వాళ్ళిద్దరికీ లోటు రాకుండా ఉండటమే వాళ్ళకి కావలసింది. నా సుఖ దుఃఖాలతో వాళ్ళకి సంబంధం లేదు. ఆ విషయమై నేను పదే పదే బాధపడి ప్రయోజనం లేదు. నా జీవితం వాళ్ళిద్దరికోసం అంకితమయిపోయింది. మరో మార్గాంతరం లేదిక. ఉన్న పరిస్థితుల్లోనే సుఖాన్ని ఊహించుకుని సంతృప్తి పడటమే నా విధి. ఎప్పుడూ నిర్లిప్తంగా ఉండగలిగిన నా మనస్సు ఎందుకో ఆ పూట మాత్రం నా ఆనందాన్ని అక్కయ్యతోనూ, అమ్మతోనూ పంచుకోవాలని తహతహలాడింది.

నేను పరీక్షలకి వెళ్ళటం, చదువు పునఃప్రారంభించటం వాళ్ళిద్దరికీ ఇష్టం లేనేలేదు. నేను సాయంకాలం వేళల కాలేజికి వెళ్ళటం వాళ్ళకి అనేక రకాలుగా ఇబ్బందులు కలిగించిందట. అక్కయ్య ఎక్కువ శ్రమపడవలసి వస్తోందని అమ్మ పరిపరి విధాల వాపోయింది. తన ఆరోగ్యం గురించి బొత్తిగా లెక్కచెయ్యకుండా నా చదువేదో, నా గొడవేదో గాని ఇంటి విషయం కించిత్తు కూడా పట్టించుకోవటం లేదని గొణుగుతూనే ఉంది అమ్మ. నేను బజారుకి వెళ్ళి కూరలు తీసుకురావన్నాళ్ళూ పప్పు పులుసూ, పప్పు పచ్చడితోనే అక్కయ్య అన్నం పెట్టింది. ఈ మధ్య అక్కయ్య క్రకాలు బీటవారిందని తెలిసింది. దాన్ని బాగుచేయించటమో, కొత్తది కొనటమో—ఏదో ఒకటి చెయ్యాలి. అన్నీ నేనే చెయ్యాలి. ఎన్నెన్నో చెయ్యాలి. అందుకే ఈ పరీక్ష పాసైతే ప్రస్తుత నికృష్ట జీవితం కొంత బాగుపడుతుందనే ఉద్దేశంతోనే అమ్మ ఎన్ని సాధించినా, అక్కయ్య ఎలా ప్రవర్తించినా లక్ష్యం చెయ్యక పట్టుదలగా చదివి ఫస్టుక్లాసులో పాసయ్యాను. నా ఆనందంలో పాలు పంచుకునే ధర్మం వాళ్ళకి లేదా?

ఏమైనా ఆ రోజున ఆనందంగానే ఉండదలుచుకున్నాను. ఎప్పుడు ఇంటికి చేరతానా, ఎప్పుడు అక్కయ్యతోనూ, అమ్మతోనూ చెబుతానా అనే ఉబలాటంతో బయలుదేరాను ఇంటికి. దారిలో రెండు రోజులకి సరిపడ తాజా కూరలూ, అమ్మకోసం అరటిపళ్ళూ కొని ఇంటికి వెళ్ళాను. రోజూ అక్కయ్య నా రాకకోసం ఎదురుచూస్తూ గుమ్మం దగ్గరే కూర్చునేది. ఆ రోజున తలుపులు మూసి ఉన్నాయి. తలుపు [illegible] తట్టినా తెరుచుకోలేదు. మూడోసారి అమ్మ వచ్చి తలుపు తీసింది.

"అక్కయ్యేది?" అన్నాను.

"లోపలుంది" అంది అమ్మ.

ఏదో అసాధారణ పరిస్థితి ఏర్పడిందని నా అంతరాత్మ ఘోషించింది. లోపలికి వెళ్ళేసరికి అక్కయ్య కుంపటికి ఎదురుగా కూర్చుని ఏదో దీర్ఘాలోచనలో మునిగిపోయి యాంత్రికంగా కుంపటి విసురుతూంది. కుంపటి మీద నీళ్ళు మరిగిపోతున్నాయి.

"ఏమి టక్కయ్యా, ఆ పరధ్యానం?" అన్నాను, గట్టిగా. అక్కయ్య ఉలిక్కిపడి నా వైపు చూసి చిరునవ్వు నవ్వి, "అప్పుడే వచ్చేశావే ఈ వేళ" అంది. అప్పుడే ఏమిటి! రోజూ కన్నా ఆలస్యం అయింది కూరలూ అవీ తీసుకురావటం వల్ల. ఎందువల్లనో అక్కయ్య పరధ్యానంగా ఉంది. నాకోసం ఆదుర్దాగా ఎదురైనా చూడలేదా నాడు. ఆ పరిస్థితిలో వెంటనే నా పరీక్ష రిజల్టు సంగతి సంబరపడుతూ చెప్ప బుద్ధి కాలేదు. తరవాత మెల్లిగా ఏ భోజనాల సమయంలోనో అనుకూలంగా ఉంటే చెప్పచ్చునులే అని నాలోని ఉత్సాహాన్ని అణిచివేసుకొని పీటమీద చతికిలపడ్డాను.

అక్కయ్య తను చేసిన అటుకుల ఉప్మా ప్లేటులో నా ముందు పెట్టి, కాఫీ కలుపుతూంది. కాఫీ కలుపుతూ అక్కయ్య మళ్ళీ పరధ్యానంలో పడింది. ఇక ఆగలేక "ఏమి టక్కయ్యా, అంత తీవ్రంగా ఆలోచిస్తున్నావు? సంగీతం చెప్పించుకునేందుకు పిల్లలు రాలేదా? సన్‌లైట్ సబ్బు అయిపోయిందా?" అంటూ అక్కయ్య కొచ్చే నిత్య సమస్యల్ని గుర్తుకి తెచ్చుకుని ప్రశ్నించాను.

"అదికాదు, నేను లేకపోతే నువ్వు ఉండగలవు కేం?" అని అడిగింది తల వంచుకుని.

ఆ ప్రశ్న విని నేను నిర్ఘాంతపోయాను. ఆ నాటి వరకూ "నేను లేకపోతే అక్కయ్యా, అమ్మా ఏమైపోతారు?" అనే ప్రశ్న నాకు నేను వేసుకుంటూ వచ్చాను. ఈ ఎదురు ప్రశ్నని కలలో కూడా ఎదుర్కోలేదు నేను. కొన్ని క్షణాలపాటు నాకు ఎటువంటి సమాధానమూ తోచలేదు. ఇన్నాళ్ళనుంచీ నా మనస్సులో పేరుకున్న తర్కాన్ని ఒక్కసారిగా ఛేదించటానికి సూటిగా వచ్చిన ప్రశ్న అది. నా మౌనాన్ని ఎలా అర్థం చేసుకున్నదో గాని అక్కయ్యే మాట్లాడటం మొదలు పెట్టింది.

"నాన్నగారు పోయిన దగ్గర్నుంచీ నువ్వే మోస్తూ వచ్చావు కుటుంబ భారాన్ని. ఎన్నాళ్ళని నీకు భారంగా ఉండగలను?" అంది.

ఇటువంటి భావం నాలో అనేక పర్యాయాలు రేకెత్తినా, అక్కయ్య నోటి నుంచి వినటం ఇదే మొదటి సారి. అమ్మ గాని, అక్కయ్య గాని నేను మోస్తున్న భారాన్నీ, వాళ్ళకోసం నేను చేస్తున్న త్యాగాన్నీ గ్రహించటం లేదనే ఇన్నాళ్ళూ నాలో నేను బాధపడ్డాను. ఆ నాడు హఠాత్తుగా అక్కయ్య నేను వినదలుచుకున్న మాటల్నే వినిపిస్తూంటే ఏవో అపశ్రుతులు వింటున్నట్లు అనిపించింది.

"ఏమి టక్కయ్యా, ఆ మాటలు? నువ్వు నాకు భారమేమిటి? ఎందు కలా కొత్తగా మాట్లాడుతున్నావు?" అన్నాను ఉద్రేకంగా.

"అది కాదే, నా భారం తొలగిపోతే నీకు తేలికగా, హాయిగా ఉండటంలో ఆశ్చర్యం ఏముంది? ఈనాటికైనా నీ మీది బరువు దించగలుగుతానేమోననే ఆశ కలుగుతోంది."

అక్కయ్య ఈ కొత్త ధోరణిలో ఎందుకు మాట్లాడుతున్నదో నా కవగాహన కాలేదు. అమ్మ అవతలి గదిలో చాపమీద పడుకుని ఉంది.


"నే నేమైనా నీకు లోటుచేశానా, అక్కయ్యా? నా శాయశక్తులా మీ సుఖం కోసమే కదా పాటుపడుతున్నది! నీ మనస్సులో ఏముందో స్పష్టంగా చెప్పరాదూ?" అన్నాను గాద్గదికంగా.

"నువ్వు అపార్థంమాత్రం చేసుకోకు, అమ్మలూ. నా కొక సంబంధం వచ్చింది. నీ కభ్యంతరం లేకపోతే ఒప్పుకుంటానని చెప్పాను అమ్మతో" అంది అక్కయ్య నా వైపు బెదిరిన లేడిపిల్లలా చూస్తూ.

అనుకోని ఈ ప్రసక్తికి క్షణకాలం పాటు ఆశ్చర్యంతో స్తబ్ధురాలినయినా, అంతలోకే తేరుకుని, "నే నేదో పెద్ద దిక్కు నయినట్లు నా అనుమతికోసం అడుగుతా వేమిటే? నాకన్నా పెద్దదానివి, ఆ వ్యక్తి మంచీ చెడూ అన్నీ చూసుకుని నీ కిష్టమయితే ఇక నా అభ్యంతరం అన్న ప్రశ్నే రాదు" అన్నాను గంభీరంగా.

అక్కయ్య ఇంకేమీ మాట్లాడకుండా నాకు కాఫీ ఇచ్చి తక్కిన పనిలో నిమగ్నురాలై పోయింది.

"ఇంతకీ ఎవరతను?" అని అడిగాను కుతూహలం అణుచుకోలేక.



''నా దగ్గర సంగీతం పాఠాలు చెప్పించుకోవటానికి వస్తూంటారు ఇద్దరు పిల్లలు — శాంతి, కమల — అని. వాళ్ళ నాన్నగారు!'' అంది.

నేను తెల్లబోతూ చూశాను అక్కయ్య కేసి. అక్కయ్య తల వంచుకుంది నా చూపులకి.

''ఆయన భార్య పోయి ఏడాది అయింది. నలుగురు పిల్లలు, వాళ్ళని చూసేందుకు మళ్ళీ పెళ్ళి చేసుకోవలసి వస్తోందిట. భార్య పోవటంతో ఆయన మనస్సు విరిగిపోయిందిట. కాలు విరిగినా పరవాలేదు, నా పిల్లలకి నచ్చింది, చేసుకుంటాను — అన్నారుట, మన పక్కింటి రామమూర్తిగారొచ్చి అమ్మతో చెప్పారు'' అని అక్కయ్య చెప్పి నా వంక అనుమానంగా చూసింది, నా మనోభావం కోసం.

''కావాలని వచ్చిన సంబంధాన్ని కాదనటం దేనికి? నీ కిష్టమయితే ఒప్పేసుకో'' అని సలహా ఇచ్చాను.

చల్లని వెన్నెల రాత్రి. ఆరుబయట చాపలు వేసుకుని ముగ్గురం పడుకున్నాం. అమ్మ అక్కయ్యకూ, నాకూ మధ్యన పడుకుంది. అర్ధరాత్రి అయినా ఆలోచనలతో నాకు నిద్ర పట్టడంలేదు. ఆ రాత్రి నా ఆలోచనలన్నీ కొత్త మార్గాల్లో పోతున్నాయి. ఇదివరకెన్నడూ అక్కయ్య గురించి నేనా విధంగా ఆలోచించలేదు. అక్కయ్య లేకుండా నా జీవనం ఎలా ఉంటుందన్న యోచనే రాలేదు ఇన్నాళ్ళూ. నాన్నగారు నా చేతుల్లో ఇంటి బాధ్యత వదిలి వెళ్ళిపోయిన నాటినుంచీ అక్కయ్య, అమ్మ నా మీద ఆధారపడుతున్న నగ్న సత్యమే నా కళ్ళ ముందు నిలిచిపోయింది గాని, అక్కయ్యమీద నేను ఆధారపడుతున్నాననే భావం నా మనఃప్రాంగణంలోకి తొంగైనా చూడలేదా నాటిదాకా.

అవును, అక్కయ్య లేకపోతే మర్నాటి నుంచీ నా పనులన్నీ ఎవరు చేసి పెడతారు? ఉదయాన్నే తొమ్మిది గంటలయేసరికి నేను బయలుదేరి ఆఫీసుకు వెళ్ళిపోవాలి. తొమ్మిది దాటి అయిదు నిమిషాలైనా బస్సు అందదు. ఆఫీసు చేరేసరికి పది అవుతుంది. అక్కయ్య పొద్దున్నే లేచి ఎనిమిదిన్నరకే వంట పూర్తి చేస్తుంది. ఏ నాడైనా ఒక్కనాడు వంట ఆలస్యం అయితే ఎంత విసుక్కుంటాను నేను — ఆఫీసుకి ఆలస్యం అయిపోతుందని? అక్కయ్య అలాంటప్పుడు నాతో వాదించదు. చివరికి నోటమ్మట ఒక్క ముక్క కూడా రానివ్వదు. అమ్మ ఎప్పుడూ దాన్ని వెనకేసుకొస్తుంది. అటువంటప్పుడు అమ్మమీద నాకు పట్టలేని కోపం వస్తుంది.



తలపులు — నిగళాలు ఎస్. జె. నరసింహారెడ్డి (సికిందరాబాదు)

''నా కష్టాన్ని గుర్తించేవాళ్ళెవ్వరు లేరీ కొంపలో'' నని పళ్ళు పటపట కొరుక్కుంటాను. అక్కయ్య నాకు మధ్యాహ్నానికని స్టీలు భరిణలో అన్నం సర్ది పెట్టి చేతికిస్తే అది పుచ్చుకుని చరచరా వీధిలోకి వెళ్ళిపోతాను. నేను ఆఫీసునుంచి సాయంకాలం తిరిగి వచ్చేసరికి ఆ నాటి నా అలసట అంతా గమనించి నే పడుతూన్న అవస్థకి వాళ్ళంతా ఆక్రోశించలేమనే నే నెల్లప్పుడూ బాధపడ్డాను. కాని, ఇంట్లో అక్కయ్య పడుతూన్న తంటాలు తలుచుకుని ఏ నాడూ జాలిపడిన పాపాన పోలేదు. పనిమనిషిని పెట్టుకుంటే పది రూపాయ లివ్వవలసి వస్తుందని అక్కయ్యే అంట్లన్నీ తోముతుంది. రెండు గదులేకదా, దీనికి పెద్దగా పనిమనిషి ఎందుకని తనే ఊడుస్తుంది. తనెప్పుడూ ఇంట్లో ఉండే మనిషే కదా అని మంచి చీరలన్నీ నా కోసం ఉంచి తా నెప్పుడూ వెలిసిపోయిన వాటినే కట్టుకుని తిరుగుతుంది. పండగ నాడైనా కొత్త చీర కట్టుకోదు. కొత్త చీర తనకోసం కొన్నా మొదట నే ఉతుకు ఉతికేదాకా నన్నే కట్టుకోమంటుంది. అక్కయ్య తనకి కొత్తచీర రెపరెపలు నచ్చవని అంటే నేను నమ్మి దాన్ని ఎప్పుడూ బలవంత పెట్టలేదు కట్టుకోమని. సాయంకాలం ఇంటికొచ్చేసరికి ఏదో ఒక ఫలహారం నా కోసం సిద్ధంచేసి పెడుతుంది. ఏ నాడైనా ఒక్కనాడు సిద్ధంగా లేకపోతే తారామండలానికి ఎగరటమో, ముఖం ముటముటలాడించుకోవటమో చేసేదాన్ని. అమ్మ నన్నే కసిరేది. ''ఏమిటే, పిల్లలకి సంగీత పాఠం చెప్పేసరికి కొంచెం ఆలస్యం అయింది. ఓ నాడు కాస్త వెనకా ముందూ అయితే అలా ఎగిరిపడటావేమిటి? బొత్తిగా జాలి అన్నది లేకుండా పోతున్నది నీకు'' అని అమ్మ అంటూంటే నాకు ఒళ్ళు మండేది.

అందరిమీదా నేనే జాలిపడాలి, అందరి కష్టాలూ నా నెత్తినే పెట్టుకోవాలి. నన్ను చూసి జాలిపడేవా ళ్ళెక్కరూ లేరు అని కుతకుతలాడిపోయేదాన్ని. నా కొచ్చిన కష్టాలు తలుచుకుని నా మీద పుట్టెడు జాలితో నా మనస్సు నిండిపోయిందేగాని, నా కన్న నికృష్ట జీవి మరొకతె నా ముందే ఉన్నదనే సత్యాన్ని విస్మరించాను. అక్కయ్య వికలాంగి కావటంతో దాని జీవితం కూడా మోడైపోయిందన్నట్లూ, అదొక యంత్రమయినట్లూ ప్రవర్తించాను కాని, అక్కయ్య కూడా వయస్సులో ఉన్న ఆడదేననీ, దానికీ మనస్సు అనే దొక టున్నదనీ ఎన్నడూ నేను తలపోయలేదు.

అందచందాల్లో గాని, ఆరోగ్యంలో గాని అక్కయ్య నా కెన్నడూ తీసిపోలేదు. నిజానికి అక్కయ్యలో ఒక్క అంగవైకల్యం తప్ప మరోవంక కాగడా పెట్టి వెతికినా కనిపించదు. పుష్టిగా ఉండే విగ్రహం, చామనచాయ రంగు, తీరైన ముఖలక్షణాలు. అన్నిటికన్నా మిన్న అయిన శ్రావ్యమయిన కంఠస్వరం — చక్కని చీర కట్టుకుని, ముఖాన పెద్ద కుంకుమ బొట్టు పెట్టుకుని జారుముడి వేసుకుని చాపమీద పొందికగా కూచుని త్యాగరాజ కీర్తన కమ్మగా పాడుతూండగా చూస్తే ఈ అమ్మాయికి అంగవైకల్యం ఉన్నదని అన్న వాళ్ళని మూర్ఖులనాలనిపిస్తుంది. అక్కయ్య చక్కగా వంట చేస్తుంది. కడుపు నిండిన తరవాత కూడా అక్కయ్య చేసిన దేదైనా పెడితే వద్దనాలనిపించదు. అమ్మకి రక్తపు

# వింతలు విడ్డూరాలు

## బాబీ

'బాబీ' సినిమాతో దేశంలో ఓ పెద్ద సంచలనం రేగింది. 'బాబీ' చూడటమే కల్చర్ అయింది. అలాంటిది విడుదలైన రెండేళ్ళకు అహమ్మదాబాదు న్యాయస్థానం వారు ఆ చిత్రం అశ్లీలంగా ఉన్నదని, అది చూచి టీనేజర్స్ ఉద్రేకాలు పొంది మానసిక వికారాలకు గురి అవుతున్నారని అభిప్రాయపడి రాజ్ కపూర్, రిషీకపూర్, డింపుల్ కపాడియా, అరుణ ఇరానీలకు సమన్లు పంపారట! ఒక నెల క్రితం ఇలాగే సమన్లు పంపితే ఎవరూ కోర్టుకు రాలేదట.

## ఇంట్లోనే సమాధి

గంగవరంలో ఒక సుపుత్రుడు తన తండ్రిని ఇంటి లోనే పాతి పెట్టాడట. అసలు ఆ తండ్రి చనిపోతే, ప్రేమకొద్దీ తనయుడు చేసిన పని కాదది. ఎవరికీ తెలియకుండా తండ్రిని హత్యచేసి, శవాన్ని గృహంలోనే భూస్థాపితం చేశాడు. 14 నెలల తరవాత ఈ విషయం పొక్కింది. పోలీసులు వెళ్ళి నేలను తవ్వగా అస్థిశేషాలు దొరికాయట.

## సంగీత చికిత్స

సంగీతం ద్వారా అనేక వ్యాధులను నయం చేయవచ్చు నన్నది భారతీయ నమ్మకం. ఈ విషయంపై పశ్చిమ జర్మనీలో ప్రయోగాలు జరుపుతున్నారు. పైగా సంగీతంతో చికిత్సలు చేయడానికి ఒక విద్యా పీఠాన్ని నెల కొల్పారు. అనేక మానసిక రుగ్మతలను, బలహీనతలను కుదర్చవచ్చు. సంగీతంతో వర్షాలు కురిపించడం అన్నది ఇటీవలనే ఒక పాశ్చాత్యదేశ సభలో జరిగింది.

## కన్న ప్రేమ

ఇటీవల బొంబాయిలో ఒక విచిత్రమైన సంఘటన జరిగింది. పార్శీల పండగనాడు పార్శీలు గుడికి వెళతారు. అలాగే ఒక దంపతులు దేవాలయానికి వెళ్ళారు. అక్కడ ఉన్న బిచ్చగాళ్ళకు దానం చేయడం అలవాటు. అలాగే అక్కడ చేరిన 300 మంది కుంటి, గుడ్డి, ముష్టి వాళ్ళకు ధర్మం చేస్తూ పోతుండగా ఒక కుర్రవాడిని చూచి ఆ ఇల్లాలి గుండె గుభిల్లుమన్నది. "ఈ కుర్రాడు మన అబ్బాయిలా ఉన్నాడు చూడండి" అని భర్తతో అన్నది. ఆమె గొంతును గుర్తించిన బిచ్చగాడు కళ్ళు లేకపోయినా, అమ్మను గుర్తించి 'అమ్మా' అని భోరుమన్నాడు. చిన్నపిల్లల్ని ఎత్తుకుపోయే ముఠా ఆ కుర్రవాణ్ణి తీసుకువెళ్ళి కళ్ళు పీకివేసి అంధుణ్ణి చేసి, ముష్టి వ్యాపారం చేస్తున్నారు. ఎన్నడో తమకు కాకుండా పోయిన బిడ్డ దొరికినందుకు ఆ తల్లిదండ్రులు పొందిన ఆనందం వర్ణనాతీతం.

## పెళ్ళిమీద పన్ను

పూనా మునిసిపల్ కార్పొరేషన్ అధికారులు ధన సంపాదనకు పెళ్ళి ఒక అవకాశంగా ఎన్నుకున్నారు. పెళ్ళి చేసుకునే వారిపై పన్నులు విధిస్తే ఆదాయం బాగుంటుంది. పూనాలో ఏడాదికి పది వేల పెళ్ళిళ్ళు జరుగుతున్నాయి. వారిపై పన్నులు విధిస్తే బాగుం టుంది.

## గాలి కార్లు

పెట్రోల్ కరువు పారిశ్రామిక, వైజ్ఞానిక వేత్త లకు బాగా పని కల్పించింది. ఇటలీలో కొందరు పరిశోధ నలు చేసి గాలితో కారు నడిపే పద్ధతిని కనిపెట్టారు. ఈ కారు గంటకు 48 కి. మీ. వేగాన నడుస్తుంది. అయితే, రెండు గంటల కొక మారు సిలిండర్స్లోకి గాలి పంపవలసి ఉంటుంది. ఒక్కొక్క కారుకు మొత్తం తొమ్మిది సిలిండర్లు పనిచేస్తాయి.

## దొంగను పట్టిన యంత్రం

శ్రీమతి ఇందిరా గాంధీ అలహాబాదు హైకోర్టులో తన గత ఎన్నికల కేసుపై, సాక్ష్యం ఇచ్చిన చారిత్రిక కాలంలో ప్రధాని పదవిలో ఉంటూ ప్రపంచంలో ఎవరూ ఇంతవరకు కోర్టులో సాక్ష్యం ఇచ్చిందిలేదు. ఆమె విచారణ ఒక గంటకు ప్రారంభమవుతుందనగా గోవింద మిశ్రా అనే పత్రికా సంపాదకుడు నల్లగౌను వేసుకొని న్యాయవాది వలె కోర్టు ఆవరణలో ప్రవే శించాడు. అతని జేబులో రివాల్వర్ ఉన్నది. ముందు జాగ్రత్తకోసం కోర్టులోకి వచ్చేవారిని ఒక యంత్రం ముందుగా నడిచేట్లు చేశారు. మిశ్రావద్ద అభ్యంతరకర మైన లోహ పదికరం ఉన్నట్టు యంత్రం సూచించగా, ఆయనను సోదాచేసి అరెస్టు చేశారు.

## మానభంగం: గారడీ

గారడీ అన్నది మానభంగ చర్య కాదు; మానభంగం గారడీ కాదు. గారడీ చేసే యువతిని మానభంగం చేస్తే జేసవుతుంది. ఒక పబ్లిక్ ప్రాసిక్యూటర్ సిటీలో గారడీ చేసే యువతిని మోహించి, ఆమె ఇంటిలో ప్రవేశించి ఆమెను బలవంతంగా అనుభవించడానికి ప్రయత్నించా డట. అంతర్జాతీయ మహిళా సంవత్సరంలో ఒక్క మహిళపై ఆక్రమణాలకు పాల్పడినవారిని కఠినంగా శిక్షించడం జరుగుతుందని మనముఖ్యమంత్రి ఖచ్చితంగా చెప్పారు.

— గాయత్రి

---

పోటు ఎక్కువైనప్పటినుంచీ అక్కడే ఇంట్లో వంట బాధ్యత.

"వంట నాకు చాకిరీ అనిపించదు. రకరకాల పదార్థాలు రుచిగా వండిపెట్టి, వాటిని ఎవరైనా ఆప్యాయంగా, తృప్తిగా తింటూంటే నా కంటకన్నా ఆనందం లేదు" అంటూ ఉంటుంది అక్కయ్య. అది నాకు పూర్తిగా వ్యతిరేకం. అక్క య్యకి గృహిణికి ఉండవలసిన ఆదర్శ లక్షణాలన్నీ ఉన్నాయి. అక్కయ్యని చేసుకో బోయే ఆయన అదృష్టవంతుడు. "అక్కయ్య లేని నా జీవనం ఎలా ఉంటుంది?" అనే ప్రశ్నే నా ఆలోచనల్ని రెచ్చగొడుతూంది. అక్కయ్యకూ, నాకూ అంతటి అనుబంధం ఉన్నదని ఆ నాటి వరకూ నేను గ్రహించలేకపోయాను. నాన్న గారు పోయిననాడు నా ఆవేదనని పంచుకునేందుకు అమ్మా, అక్కయ్యా ఉన్నారు. ఈ నాడు నాకు కలగబోయే ఒంటరితనాన్ని పంచుకునేందుకు ఎవ రున్నారు? నా ఆవేదనని ఎవరి దగ్గర నివేదించుకోను? నన్ను అరం చేసుకునే సహృదయం ఎవరి కుంది?

అమ్మ! అమ్మకి నే నేమని చెప్పను? అక్కయ్యని విడిచి నే నుండలేను, అక్క య్యని ఆపమని చెప్పనా? స్వార్థపరురాలి నని అమ్మ నన్ను అసహ్యించుకోదా? అసూయపడుతున్నానని అమ్మ నన్ను అపార్థం చేసుకోదూ? అమ్మ నన్ను అర్థం చేసుకోగలదన్న నమ్మకం నాకు లేదు. నా సుఖ దుఃఖాలను ఏ నాడూ అమ్మతో విన్నవించుకోలేదు. నా స్వవిషయాలనుగాని, మనోభావాలనుగాని అమ్మతో ఏ నాడూ మనస్సు విప్పి చెప్పుకోలేదు. నా చిన్నతనం నుంచీ నాన్నగారి దగ్గర ఉన్నంత చనువు అమ్మ దగ్గర నా కెన్నడూ లేదు. కాలి గోటికి చిన్న దెబ్బ తగిలినా నాన్నగారి ఒళ్ళో తల దూర్చి ఏడ్చాను కాని, అమ్మ దగ్గిర కెప్పుడూ పరుగెత్తి లేదు. అక్కయ్యకే మొదటినుంచీ అమ్మదగ్గర అలవాటు. అమ్మకి కూడా అక్కయ్య మీదే అభి మానమూ, అమితానురాగమూ. నన్ను అభిమానించి ప్రేమించేవాళ్ళెవరూ లేరు. నాన్నగారు లేరు. అక్కయ్య కూడా వెళ్ళిపోతుంది. ఇంకెవరున్నారు, నా కెవరున్నారు, అమ్మా అంటూ బాధగా మూలిగింది నా మనసు.

"అమ్మా!" అన్న శబ్దం పైకి వెలువడిపోయింది నా ఉద్విగ్నస్థితిలో. "అమ్మా!" అన్న ఆవేదనా భరితమయిన ఆ మాటలోనే మా అమ్మ నా హృదయం లోని బాధనంతా అర్థం చేసుకున్నట్లుగా, నిద్రపోతున్న దనుకున్న అమ్మ నా వైపు తిరిగి తలమీద ఆప్యాయంగా నిమిరింది. ప్రేమభరితమైన ఆ స్పర్శతో నా దుఃఖం కట్టలు తెంచు కుంది. "అమ్మా, నువ్వైనా నన్ను విడిచి ఎప్పుడూ వెళ్ళకమ్మా" అంటూ రోదిస్తూంటే, మా అమ్మ మౌనంగా నన్ను తన గుండెలకి గట్టిగా హత్తు కుంది. ★